కోర్కెలు తీర్చే కల్పవల్లి.. కనకదుర్గమ్మ

- కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలు
- ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
- కరుణించమ్మా.. కనకదుర్గమ్మ


జంగారెడ్డిగూడెం: కొలువుదీరిన వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు


ద్వారకాతిరుమల: రాజరాజేశ్వరీ ఆలయం వద్ద మందిరంలో కొలువుదీరిన అమ్మవారు


జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శైవక్షేత్రంలో రాజ రాజేశ్వరీ అమ్మవారు


కొయ్యలగూడెం: రజత కవచాలంకృత అలంకరణతో అమ్మవారు

జంగారెడ్డిగూడెం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తితో 200 మంది ముత్తయిదువులు కలశాలు ధరించి పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. డీకేడీ సత్యనారాయణ, భాగలక్ష్మి దంపతులు కలశ స్థాపనతో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రవిస్వీట్స్ అధినేత అప్పారావు అమ్మవారికి రూ. 10వేలు విలువైన వెండి ముఖ ప్రతిమను అందించారు. ఉదయం కేశనపల్లి రంగారావు, రత్నకుమారి దంపతులు, సాయంత్రం శ్రీవెంకటసాయి రెడీమేడ్స్ యాజమాన్యం ప్రసాద వితరణ చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. పట్టణ ప్రముఖులు పరిమి సత్తిపండు అమ్మవారిని దర్శించుకోగా, ఆలయ కమిటీ చైర్మన్ కలగర వీర్రాజు, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. గంగానమ్మ అమ్మవారి దివ్యసన్నిధికి నూకాలమ్మ అమ్మవారి ఆలయకమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), రామలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆలయకమిటీ సభ్యులు, శ్రీనూకాంబికా సేవా బృందం ఆధ్వర్యంలో గంగానమ్మకు సాంప్రదాయ సారెను సమర్పించారు. గొట్టుముక్కల వంశీకుమార్ రాజు, వగ్వాల పుల్లారావు, రొంగల నాగేశ్వరరావు, పెన్మత్స రాజంరాజు, డీకేడీ సత్యనారాయణ, మండవల్లి విజయసారధి దంపతులచే నూకాలమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి 21వ దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు భక్తులకు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. దారా రవీంద్ర దంపతులు, దారా చక్రవర్తి దంపతులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో తూర్పున ఫైర్ స్టేషన్ ప్రక్కన శ్రీ స్వయంభు పంచముఖ శ్వేతర్క హేరంభ గణపతి ఆలయంలో కొలువైన శ్రీ చాముండేశ్వరీదేవి అమ్మవారు తొలిరోజు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో శ్రీ చక్ర అభిషేకం, విజయదుర్గ అమ్మవారికి పుష్పార్చన కుంకుమార్చన నిర్వహించారు.

క్షేత్రపాలకుడి ఆలయంలో కుంకుమ పూజలు

ద్వారకాతిరుమల: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్ల ఆలయాలకు భక్తుల రాక తెల్లవారు జాము నుంచే మొదలవడంతో ఆలయాల్లో సందడి నెలకొంది. అందులో భాగంగా స్థానిక ఆళ్వార్ సదనం ఎదురుగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలోనూ, అలాగే తూర్పు వీధిలోని గంగానమ్మ ఆలయంలో కమిటీ సభ్యులు దుర్గమ్మకు విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా లక్ష్మీపురం ఆలయం వద్ద ఉన్న దుర్గాదేవి విగ్రహాలకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి రాజరాజేశ్వరి, గంగానమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద నెలకొల్పారు. అదే విధంగా ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడి ఆలయంలో శ్రీ భ్రమరాంబకు అర్చకులు కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. జపమాలను పట్టుకొని దర్శనమిచ్చే ఈ తల్లిని బ్రహ్మచారిణిగా ఆరాధిస్తాం. ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న ఆలయంలో శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు శ్రీ వాసవీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు.

గాయత్రీదేవిగా రాజరాజేశ్వరీదేవి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురవాయిగూడెంలో బ్రహ్మసూత్ర శైవక్షేత్రంలో కొలువైన శ్రీ రాజ రాజేశ్వరీ అమ్మవారు, అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఈ నెల 4న రాజరాజేశ్వరీ అమ్మవారు గాయత్రీ దేవిగా, జ్ఞాన సరస్వతీ అమ్మవారు గౌరీ దేవీగా భక్తులకు దర్శనమిస్తారు.

దేవి శరన్నవరాత్రులు ప్రారంభం

కొయ్యలగూడెం: దసరా మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కనకదుర్గమ్మను బాలా త్రిపుర సుందరిగా, రజత కవచాలంకృత కనకదుర్గమ్మగా అలంకరింపబడి భక్తులచే పూజల అందుకుంది. కరాటం వై.జంక్షన్‌లో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారు ఆశ్వీజ మాస శుద్ధ పాడ్యమి నవరాత్రి మహోత్సవంలో మొదటిరోజు అలంకరణగా శ్రీ రజిత కవచాలంకృత దుర్గాదేవి దేవిగా పూజలందుకుంది. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెంలోని శ్రీ చక్రసహిత కనకదుర్గమ్మ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణతో పూజలు అందుకుంది. కన్నాపురం రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి కొయ్యలగూడెం గ్రామదేవత చింతాలమ్మతో సహా అన్ని పంచాయతీల పరిధిలోని అమ్మవార్ల ఆలయాలు దసరా శోభ సంతరించుకున్నాయి.

మన్యంలో నవరాత్రి శోభ

బుట్టాయగూడెం: మన్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉన్న ఆలయాల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిర్లలో కొలువై బాలాత్రిపుర సుందరీ అలంకరణలో నవరాత్రి మహోత్సవాల్లో మొదటిరోజు అమ్మవారు పూజలందుకోవడం జరిగింది. స్థానిక గంగానమ్మ తల్లి ఆలయంలో కలశస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా స్థానిక త్రిశక్తి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్లకు చిన్నారి బాలికలు పూజలు చేశారు. దొరమామిడి, రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం శివారు కొత్తపేట, స్థానిక త్రిపుర సుందరీ సమేత కామేశ్వరస్వామివారి ఆలయంలో, వైఎస్సార్‌నగర్‌లో తదితర గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.

విద్యుత్ అలంకరణలతో ఆలయాలు ముస్తాబు

పోలవరం రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని అమ్మవారి దేవాలయాలు విద్యుత్ అలంకరణతో ముస్తాబయ్యాయి. మొదటి రోజు గురువారం బలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం, పట్టిసీమ, గూటాల గ్రామాల్లోని గోదావరి నదీ తీరంలో గల అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి.


బుట్టాయగూడెం: దొరమామిడిలో ప్రత్యేక పందిర్లలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహం


పోలవరం రూరల్: చిన రామాలయంలో బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

క్లుప్తంగా

అన్నదాన ట్రస్ట్ ఏర్పాటు


ట్రస్ట్ వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న కెనరా బ్యాంకు మేనేజర్ దత్తసాయి

టి.నరసాపురం: శ్రీ ద్వారకామయి అన్నదాన చారిటబుల్ ట్రస్ట్‌ను బొర్రంపాలెంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్‌చే రూపొందించిన వెబ్‌సైట్‌ను బొర్రంపాలెం కెనరా బ్యాంక్ మేనేజర్ దత్తసాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ చెరుకువాడ నరసింహారావు 2019లో ట్రస్ట్ ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోగా 2024లో 80ఏ వచ్చిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంపరాల ఉమామహేశ్వరరావు, కోశాధికారి బచ్చు నందకుమార్, జగదీష్, కె.మల్లయ్య, రమేష్ బాబు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం: వార్షిక మరమ్మతులు, చెట్ల తొలగింపు పనుల నిమిత్తం ఈ నెల 4వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 కేవీ టి.నరసాపురం, 33/11కేవీ రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు చెల్లించాలి


సామాజిక ఆరోగ్యకేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

బుట్టాయగూడెం: స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో పని చేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ఆరు నెలలుగా రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తూ వారికి వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. 6 నెలలుగా జీతాలు లేకపోవడం వల్ల శానిటేషన్ సిబ్బంది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పలపాడులో సీపీఐ నియోజక వర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ గిరిజన అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కారం దారయ్య, కేవీ రమణ రాజు, శానిటేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంకోటలో సీపీఎం సమావేశం


సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వేలేరుపాడు: పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామం రుద్రంకోట నిర్వాసితులకు పునరావాసం, పరిహారం కల్పించాలని సీపీఎం గ్రామశాఖ డిమాండ్ చేసింది. రుద్రంకోటలో సీపీఎం గ్రామశాఖ 9వ మహాసభ గురువారం నిర్వహించారు. తుంగ నాగమణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ఎస్‌కే మైబు జెండా ఆవిష్కరించారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మడివి దుర్గారావు, సభ్యులు మడకం ఏసుబాబు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామశాఖ నూతన కార్యదర్శిగా తుంగ శ్రీనును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌కే మైబు, ఎస్‌కే సైదాబి, జరీనా, తదితరులు పాల్గొన్నారు.

పండుగకూ పాత సర్వీసులే


బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కొయ్యలగూడెం: దసరా పండుగకు ఏటా కొత్త సర్వీసులు నడిపే ఆర్టీసీ ఈ ఏడాది మాత్రం పాత సర్వీసులతోనే సరిపెట్టింది. దసరా సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ నెలకొంది. గురువారం నుంచి ఈ నెల 13 వరకు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో ప్రయాణ రద్దీ ఏర్పడింది. కొయ్యలగూడెం నుంచి ప్రయాణికులు తమ గమ్య స్థానాలను చేరుకోవడానికి బస్టాండ్‌లో బస్సు ల కోసం ఎగబడుతున్నారు. దసరా సెలవుల ప్రారంభ, సెలవుల ముగింపు రోజుల్లో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో దసరా సెలవుల ప్రారంభం నుంచి అదనపు సర్వీసులు నడిపే వార ని, ఈసారి సర్వీసులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేయాలి


వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న జెడ్పీటీసీల ఛాంబర్ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి


వైఎస్ జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన జెడ్పీటీసీ రమేష్

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ పటిష్టతకు క్షేత్ర స్థాయి నుంచి కృషి చేయాలని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నట్లు జెడ్పీటీసీల ఛాంబర్ అధ్యక్షుడు, జంగారెడ్డిగూడెం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జెడ్పీటీసీలతో జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీలతో పలు విషయాలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్చించినట్లు బాబ్జి తెలిపారు. అలాగే రాబోయేవి మంచి రోజులని, వాటిని సద్వినియోగం చేసకోవడానికి ప్రతీ కార్యకర్త, అభిమానిని చైతన్య పరచాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, భరోసాతో ముందుకు సాగాలని జగన్ చెప్పారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల్లోనే ఉండాలని, పార్టీకి పూర్వ వైభవం తిరిగి సాధించే బాధ్యత ప్రతీ ఒక్కరూ తీసుకోవాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారని జెడ్పీటీసీ బాబ్జి తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కామవరపుకోట జెడ్పీటీసీ కడిమి రమేష్ గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ఒక్కరూ అధైర్య పడొద్దని, అందరూ ఐక్యతతో పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారని పేర్కొన్నారు. రానున్నవి వైఎస్సార్‌సీపీకి మంచి రోజులని ఆయన సూచించినట్లు జెడ్పీటీసీ కడిమి రమేష్ తెలిపారు.

అధికారులకు వీడ్కోలు


అధికారులను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

కొయ్యలగూడెం: సేవలకు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకునే అధికారులు కొందరే ఉంటారని అటువంటి వారిని గౌరవించి సత్కరించుకోవడం పౌరులుగా మన బాధ్యతని సర్పంచుల ఛాంబర్ పేర్కొంది. పరింపూడి పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించి కోడూరు మండలం పెనుమంట్రకి బదిలీపై వెళ్తున్న సీహెచ్ సత్యనారాయణ, బిల్ కలెక్టర్‌గా ఉద్యోగ విరమణ చేసిన సీహెచ్ చాన్ భాషాను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు ముప్పిడి విజయకుమారి, ఏలేటి చిన్న తుక్కయ్య, మద్దిపాటి నాగమణి, కడకట్ల గడ్డియ్య, తహసీల్దార్ కె.చెల్లన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజమెత్తిన ఆశ వర్కర్లు


బుట్టాయగూడెం: అంతర్వేదిగూడెం పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు



కుక్కునూరు: పీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆశ వర్కర్లు


టి.నరసాపురం: ఆశ వర్కర్ల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు


కొయ్యలగూడెం: బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశ వర్కర్లు

బుట్టాయగూడెం: టి.నర్సాపురం మండలం గుండిగూడెంలో ఆశ వర్కర్ లక్ష్మీమంగను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ మండలంలోని అంతర్వేదిగూడెం, దొరమామిడి, నందాపురం, కేఆర్‌పురం, పులిరామన్నగూడెం ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద గురువారం ఆశ వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్కర్లపై రోజురోజుకూ వేధింపులు ఎక్కువవుతున్నాయన్నారు. రాజకీయ జోక్యం పెరుగుతుందని వారు ఆశ వర్కర్లను తొలిగిస్తామని భయబ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. టి. నర్సాపురం మండలంలో తొలగించిన లక్ష్మీమంగను విధుల్లోకి తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ మండల కార్యదర్శి మంగతయారు, పోసమ్మ, శాంతకుమారి, గంగాదేవి, బేబి, లక్ష్మీ, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ మంగను విధుల్లోకి తీసుకోవాలి

కుక్కునూరు: పీహెచ్‌సీ ఆశ వర్కర్ లక్ష్మీ మంగను విధుల నుండి అక్రమ తొలగింపుకు నిరసనగా ఆరు రోజుల నుంచి విధులు బహిష్కరించి ఆశ వర్కర్లు ఆందోళన చేస్తున్నారు. వారికి మద్దతుగా సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పాల్గొని మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అధికార పార్టీలతో స్థానిక పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పీ నాగరాజు ఆశా వర్కర్‌ను వేధించి అన్యాయంగా తొలగించారని జిల్లా అధికారులు సైతం వారి వాదనే విని ఏకపక్షంగా తొలగించారన్నారు. ఇటీవల డీఎంహెచ్‌వోను యూనియన్ కలిస్తే మళ్లీ విచారణ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేటి వరకు విచారణ ప్రారంభం కాకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం విడనాడి, తొలగించిన ఆశ వర్కర్ లక్ష్మీమంగను తిరిగి విధుల్లోకి తీసుకొని తొలగింపునకు కారణమైన మెడికల్ ఆఫీసర్‌పైన ఎంఎల్‌హెచ్‌పీ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.నాగేంద్రరావు, కారం రాజేశ్వరి, కాక బాపనమ్మ, కంగాల తులసి, మారతమ్మ, రాజ్యలక్ష్మి, సుశీల, సక్కుబాయ్, ఆదెమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ విధుల్లో కొనసాగేలా చర్యలు

టి.నరసాపురం: ఆశ వర్కర్ లక్ష్మీ మంగ విధుల్లో కొనసాగేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆశ వర్కర్లకు హామీ ఇచ్చారు. టి.నరసాపురంలో గత వారం రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న ఆశ వర్కర్ల శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంఎల్‌హెచ్‌పీ నాగబాబుపై విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆశ వర్కర్లు ఆందోళన విరమించారు.

ఆశ వర్కర్లకు న్యాయం చేయాలి

కొయ్యలగూడెం: ఆశ వర్కర్లకు న్యాయం చేయాలంటూ బయ్యన్నగూడెం పీహెచ్‌సీ వద్ద గురువారం ఆశ వర్కర్లు ఆందోళన నిర్వహించారు. టి.నరసాపురం మండలం గండిగూడెంలో ఆశ వర్కర్ కె.లక్ష్మీ మంగపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కక్షగట్టి వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ వీరు ఆందోళన చేశారు. సందర్భంగా మద్దతు ఇవ్వడానికి వచ్చిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ పీహెచ్‌సీలో తప్పు చేసిన వ్యక్తిని తొలగించకుండా, నిర్దోషి అయిన ఆశ వర్కర్‌ను తొలగించడం దారుణమని ఖండించారు. నోటీసులు, విచారణ లేకుండా ఆమెను ఎలా తొలగిస్తారో అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.గంగారత్నం, రోజా, బి.పోసి, లక్ష్మీరాణి, కె.నాగమణి, ఎం.సుజాత, వై.విజయలక్ష్మి, పి.నాగమణి, కె.సుజాత, జయలక్ష్మి, ఎం.సంతోషం, కె.రాధ, ప్రభావతి, సువార్త, శాంతకుమారి, పద్మావతి, ఆర్.జగతి, నళిని, తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ

కొయ్యలగూడెం: సెయింట్ పాల్ టౌన్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో గురువారం స్త్రీల ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. క్రీస్తులో స్వతంత్ర ప్రేమతో దీక్ష అనే ముఖ్య సందేశాన్ని ఇవ్వడంలో భాగంగా ర్యాలీని ఏర్పాటు చేశామన్నారు. పాస్టర్ రాజేష్ బాబు, కోలాటి లలిత, స్త్రీ సమాజ్ వారు శాంతియుత ప్రదర్శన నిర్వహించారు.

దరఖాస్తుల స్వీకరణ

పోలవరం రూరల్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటరుగా దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఆర్ఎస్ రాజు తెలిపారు. నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుదారులు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో నివాసి అయ్యి ఉండి, ఓటరు గుర్తింపు కార్డు ఏ మండలంలో కలిగి ఉంటుందో ఆ మండలంలోనే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులై మూడు సంవత్సరాలు పూర్తవ్వాలన్నారు. పాస్‌పోర్టుసైజు ఫోటోతోపాటు దరఖాస్తు, సర్టిఫికెట్లు జతచేయాలన్నారు.

కాలుష్యపు కోరల్లో ఎర్ర కాలువ

- కలుషితమవుతున్న నీరు
- చర్యలు చేపట్టాలంటున్న రైతులు


కలుషితమవుతున్న నీరు


తూరల ద్వారా ఎర్రకాలువలో కలుస్తున్న వ్యర్థాలు

జంగారెడ్డిగూడెం రూరల్: మూగజీవాల తాగునీటికి, రైతుల పొలాల సాగు నీటికి ఉపయోగపడాల్సిన ఎర్రకాలువ నీరు కలుషితమవుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మధ్యతరహా ప్రాజెక్టుగా పేరున్న ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయం ప్రధాన కాలువలోకి పశువుల వ్యర్థాలను విడుదల చేసి నీటి కలుషితానికి పాల్పడుతున్నారు. గురవాయిగూడెం ఎర్ర కాలువ వంతెన ప్రాంతంలో కాలువలోకి పెద్ద తూరలతో పైపులైన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఒక పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న గేదెల ఫామ్‌కు చెందిన వ్యర్థాల నీటిని ఎర్రకాలువ ప్రధాన కాలువలోకి విడుదల చేస్తున్నారని, దీంతో కాలువలోని నీళ్లు కలుషితం అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. దుర్వాసనతోకూడిన నీళ్లు ఈ తూరల ద్వారా కాలువలోకి చేరడంతో నీరు నల్లటి రంగులోకి మారిపోతుంది. అనేక మూగ జీవాలను ఈ వాగులోకి పశుకాపరులు మేత కోసం తోలుకొస్తుంటారు. ఇక్కడ లభించే తాగునీటిని మూగజీవాలు సేవిస్తుంటాయి. వ్యర్థాలతో నీరు కలుషితం అవడంతో ఈ నీటిని తాగితే ఎక్కడ మూగ జీవాలు ప్రాణాల మీదకి వస్తోందోనని భయపడుతున్నారు. కాలువలోకి వ్యర్థాలు విడుదల చేయకూడదని నిబంధనలు ఉన్నా అవేమి పట్టనట్టు నిర్వాహకులు వ్యవహరించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ తొలగించి, నీటి కలుషితాన్ని అరికట్టాలని కోరుతున్నారు.